క్లుప్తంగా

కొత్తకోట ఎంఈవో -2గా బ్రహ్మాజి



రావికమతం: కొత్తకోట హైస్కూల్ హెచ్ఎం నవర బ్రహ్మాజి మండల విద్యాశాఖాధికారి-2గా పదోన్నతి పొందారు. ప్రభుత్వం ప్రతి మండలానికి రెండో విద్యా శాఖాధికారిని నియమించి పాఠశాలల పనితీరు మరింతగా మెరుగుపర్చేందుకు చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. పెందుర్తి మండలం శిరసపల్లి హైస్కూల్ నుంచి ఇటీవలే బదిలీపై వచ్చిన బ్రహ్మాజి ఎంఈవో -2గా పదోన్నతి పొందడంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

'న్యాయ పోరాటంతో రోడ్డు విస్తరణ అడ్డుకుందాం'

నర్సీపట్నం: న్యాయ పోరాటం ద్వారా నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణను అడ్డుకునేందుకు రోడ్డు విస్తరణ బాధితులు తీర్మానం చేసుకున్నారు. రోడ్డు విస్తరణ బాధితులు ఆదివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. వందడుగుల విస్తరణకు అధికారులు సిద్ధమైన తరుణంలో న్యాయ పోరాటమే శరణ్యమని అభిప్రాయపడ్డారు. మరోసారి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచన చేసి 80 అడుగులకు రోడ్డు విస్తరణ చేపట్టాలని రోడ్డు విస్తరణ బాధితుల సంఘం ప్రతినిధి బంగార్రాజు పేర్కొన్నారు. సమావేశంలో భవన యజమానులు, వ్యాపారులు పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయంతం చేయండి



కార్మికులకు కర పత్రాలను అందిస్తున్న ఈశ్వరరావు

కె.కోటపాడు: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 20న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏ.పి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు కోరారు. ఆదివారం కె.కోటపాడులో భవన నిర్మాణ కార్మికులను కలిసి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా వారికి కర పత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పి.సోమునాయుడు, రాము, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పసర్ల మోదమ్మ పండగ



సత్యవరం పసర్ల మోదమ్మ ఆలయం వద్ద పశువులు

మాడుగుల: సత్యవరంలో ఆదివారం పసర్ల మోదకొండమ్మ పండగ వైభవంగా నిర్వహించారు. మూడేళ్లకోసారి నిర్వహించే ఈ పండగలో పెద్ద ఎత్తున రైతులు తమ పశువులను ఆలయానికి తోలుకెళ్లారు. అక్కడ వసంతకంతో పూజలు చేసి అనంతరం పశువులపై జల్లారు. ఇలా చేయడం వల్ల పశువులకు ఎటువంటి రోగాలు దరి చేరవని ఈ ప్రాంత రైతుల విశ్వాసం.

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీటీసీ రాజేష్

కె.కోటపాడు: చౌడువాడలో కనకదుర్గమ్మ ఆలయ పదో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పులిబంటి అప్పారావు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ తదితరులు పూజలు చేశారు.

నర్సీపట్నం ఎంఈవోగా నాగేంద్ర

నర్సీపట్నం: నర్సీపట్నం మండల విద్యాశాఖ అధికారిగా నాగేంద్ర నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సాయి శైలజ పరవాడ బదిలీ అయ్యారు. వేములపూడి జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్న నాగేంద్ర ఎంఈవోగా నియమితులయ్యారు.

గతంలో ఏ ప్రభుత్వమైనా ఇంటింటికీ వెళ్లిందా?

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



చినమదీనలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న విప్ ధర్మశ్రీ



చిట్టియ్యపాలెంలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: గతంలో గద్దె నెక్కిన తర్వాత ఏ ప్రభుత్వం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగిన పాపాన లేదని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చినమదీన, చిట్టియ్యపాలెం గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల కాలంలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించి బ్రోచర్లు అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాక ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన అర్హుల్ని గుర్తించి పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని చిట్టియ్యపాలెం, చినమదీన గ్రామస్తులు విప్ ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని విప్ ధర్మశ్రీ విమర్శించారు. ఆనాడు సంక్షేమ పథకం అందాలంటే అర్హులైన వారు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదన్నారు. పైగా డబ్బులు ఇస్తేనే వారు సంతకాలు చేసేవారని దుయ్యబట్టారు. గతంలో ఏవరైనా పింఛన్‌దారుడు చనిపోతేనే మిగిలిన వారికి పింఛన్ అందించేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి గ్రామ వలంటీర్ల ద్వారా అర్హతే ప్రామాణికంగా పింఛన్, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి దేశంలోనే నంబర్‌వన్ ముఖ్యమంత్రిగా జగనన్న నిలిచారని ప్రశంసించారు. చిట్టియ్యపాలెంలో గ్రామకంఠ స్థలం ఆక్రమణలకు గురవుతుందని, శివాలయం వద్ద ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు కోరగా అధికారులు అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని విప్ ధర్మశ్రీ ఆదేశించారు. గ్రామంలో శిథిలమైన సామాజిక భవనం స్థానంలో కొత్త భవనానికి నిధులు మంజూరు చేయాలని, తలారి అప్పలనాయుడు ఇంటి నుంచి రామాలయం వరకు మురుగు నీరు బయటకు పోయేలా సిమెంట్ కాలువ ఏర్పాటు చేయాలని చినమదీన గ్రామస్తులు కోరారు. వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు విప్ ధర్మశ్రీ ప్రకటించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, సర్పంచ్‌లు, నాయకులు బుదిరెడ్డి అబ్బాస్, పచ్చికూర మంగవేణి గోవిందరావు, కోరుకొండ అప్పలనాయుడు, గంట్ల అప్పలనాయుడు, సాయం రమేష్, బోయిన నారాయణమూర్తి, ముచ్చకర్ల శ్రీను, గోపిశెట్టి శ్రీను, సానాపతి రాము, నూకాల నాగరాజు, పచ్చికూర నాగేశ్వరరావు, అప్పలనాయుడు, బీర మహాలక్ష్మి పాల్గొన్నారు.

చీమలపాడులో 'గడప గడపకు' నేడు

రావికమతం: చీమలపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం చేపడుతున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు ఆదివారం తెలిపారు. ఉదయం 6 గంటలకే ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనాలని తెలిపారు.

గడప గడపకూ సంక్షేమం

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



ద్వారకానగరం గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: నర్సీపట్నం నియోజకవర్గంలో సంక్షేమ పథకం అందని ఇల్లు లేదు.. లబ్ధిదారుడు లేని కుటుంబం లేదని, అందుకే ప్రతీ ఇంటికి వచ్చి వాటి గురించి వివరిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. పాతమల్లంపేట పంచాయతీ శివారు ద్వారకనగరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టరు బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు ఎంతోమంది పేదలను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడం వల్లే దేశంలో ఉత్తమ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డికి గుర్తింపు లభించిందన్నారు. ఇటువంటి మంచి పాలన అందిస్తున్న సీఎంకు వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. గ్రామ సచివాలయం వ్యవస్థతో పాటు వలంటీర్ల ద్వారా గ్రామాల్లో సమస్యలు వెన్వెంటనే పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, పార్టీ యూత్ విభాగం మండలాధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, మండల సచివాలయం కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు కొరుప్రోలు పాణీశాంతారామ్, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, పాతమల్లంపేట సర్పంచ్ సోమల యమున, నాయకుడు నక్కా అచ్చుతం, మాజీ సర్పంచ్ పప్పల రమణ, ఆదపురెడ్డి నాయుడు, తుబే జోగులు, ఈగల సత్తిబాబు, కోట అర్జున, గొర్లు మల్లేస్, భీమిరెడ్డి అప్పలనాయుడు, గార నాగరాజు పాల్గొన్నారు.

వచ్చే నెల 16న మోదమాంబ పండగ



కె.జె.పురంలో మోదమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మోదమాంబ అమ్మవారి పండగ వచ్చే నెల 16వ తేదీన నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు స్థానిక రామాలయంలో సమావేశమై పండగ నిర్వహణకు గాను ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కాళ్ల అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడిగా రాపేట జోగినాయుడు, కోశాధికారిగా శరగడం ఆదిబాబులను ఎన్నుకున్నారు. వీరితోపాటు ఉత్సవ కమిటీ సభ్యులుగా మద్దాల వెంకట సత్యనారాయణ, భీశెట్టి కోటిప్పారావు, ఆడారి వెంకట్రావు, సూరిశెట్టి గోవిందరాజు, భీశెట్టి వాసు, ఆడారి మధు, ఆడారి గంగునాయుడు, ఆడారి శంకరరావు, రాపేట శంకరరావు, సూరిశెట్టి అచ్చింనాయుడు ఉన్నారు. సమావేశంలో సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, ఉప సర్పంచ్ కాళ్ల కోటమ్మ, జగన్, నాయకులు మళ్ల కన్నబాబు, ఆడారి కన్నారావు, ఆడారి నూక గణేష్ పాల్గొన్నారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక చెరకు కాటా ఆవరణలో నూకాంబికకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎం.కె.వల్లాపురం చెరకు కాటా ఆవరణలో మోదమాంబకు, సాగరంలో మోదమాంబకు ఒడ్డు పండగలు నిర్వహించారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు



ప్రధానోపాధ్యాయుడు పేరునాయుడును సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కె.కోటపాడు: అంకితభావంతో పనిచేస్తేనే ఏ ఉద్యోగికైనా ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు అన్నారు. సూదివలస ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా విధులను నిర్వహించిన పేరునాయుడు ఇటీవల గోపాలపట్నం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆదివారం ఆయనకు పీఎంసీ కమిటీ చైర్మన్ రంధి పుష్ప ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. పదేళ్ల పాటు ప్రధానోపాధ్యాయునిగా పని చేసి ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధను చూపి మంచి చదువులను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రంధి రామునాయుడు, వర్రి సన్యాసినాయుడు, వెంకట శివ ప్రసాద్, గుడివాడ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

రావికమతం: కొత్తకోట దుర్గాదేవి ఆలయం వద్ద ఆదివారం భారీ శాంతి అన్నసమారాధన జరిగింది. ఈ నెల 15, 16 తేదీల్లో ఆలయ 13వ వార్షికోత్సవం నిర్వహించారు. దీన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామస్తులేగాక పలు గ్రామాల నుంచి వేలాది భక్తులు హాజరయ్యారు. తొలుత పూజలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తవ్వేశారు.. వదిలేశారు!

- గోతులతో వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు



నిండుగొండ కూడలి సమీపంలో మదుముల కోసం తవ్విన ప్రమాదకరంగా గొయ్యి

రోలుగుంట: నర్సీపట్నం -వడ్డాది ఆర్అండ్‌బీ రోడ్డులో మదుముల మరమ్మతుల కోసం కాంట్రాక్టర్ గోతులు తవ్వించాడు. కొన్ని రోజులుగా అలాగే వదిలేయడంతో వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో వెలంకాయపాలెం నుంచి రోలుగుంట దాటే వరకూ ఆర్ అండ్‌బీ రోడ్డుకు సంబంధించి మదుముల మరమ్మతులు చేస్తున్నారు. ఇక్కడ కాంట్రాక్టర్ గోతులు తవ్వించి పక్షం రోజులు గడుస్తున్నా పనులు చేయించకుండా వదిలేశాడు. దాంతో చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పనిచేసే ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెడల్పులో మూడు వంతుల వరకు గోతులు తీయడం వల్ల రాత్రిళ్లు అదుపు తప్పి పడే ప్రమాదముందని వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాక మరిడమ్మకు వేతనదారుల పూజలు



మర్రిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ఉపాధి వేతనదారులు

కె.కోటపాడు: వీఆర్పీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం చౌడువాడలో వాక మరిడమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ సాగు ప్రారంభ కాలంలో ఉపాధి వేతనదారులు ఆరేళ్లుగా ఈ పండగ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కోడి పందేలాడుతున్న ఇద్దరి అరెస్టు

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు శివారులో కోడిపందాలాడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ నరసింగరావు ఆదివారం తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. అజ్ఞాత వ్యక్తులిచ్చిన సమాచారం మేరకు కోడిపందాల స్థావరంపై దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి మూడు కోళ్లు, రూ.2,100 నగదు స్వాధీనపరుచుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోలుగుంట ఎంఈవో-2గా జగ్గారావు

రోలుగుంట హెచ్ఎం బాబూలాల్‌కు ఎంఈవో-2గా పదోన్నతి



జగ్గారావు

రోలుగుంట: అల్లూరి జిల్లా సీలేరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.జగ్గారావు పదోన్నతిపై రోలుగుంట ఎంఈవో-2గా నియమితులయ్యారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.డి.బాబూలాల్‌కు పద్మనాభం ఎంఈవో-2గా పదోన్నతిపై బదిలీ అయింది. వీరికి ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్జేడీ జ్యోతికుమారి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతవరకు పనిచేసిన ఇన్‌చార్జి ఎంఈవో సాయిశైలజకు పరవాడ మండలం బదిలీ అయింది. ఈమె రోలుగుంట మండలంలోని పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించడంతో మంచి గుర్తింపు పొందారు. ఉపాధ్యాయ సంఘాల్లో తారతమ్యం చూపకుండా సమస్యలు పరిష్కరించారు. పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేశారు. బదిలీపై వెళ్లిన ఆమెకు పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుడ్డిగ అప్పారావు, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, అధ్యక్షుడు జి.వి.రమణ శుభాకాంక్షలు తెలిపారు.

తగ్గని భగభగలు



నిర్మానుష్యంగా కె.కోటపాడు మార్గం



జనసంచారం లేని విశాఖ-నర్సీపట్నం రహదారి

మాకవరపాలెం: భానుడి భగభగలతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వారం రోజులుగా మండలంలో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతన్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటలు దాటితే రోడ్డుపైకి వచ్చేందుకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆదివారం కూడా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో సాయంత్రం 4 గంటల వరకు విశాఖ-నర్సీపట్నం రోడ్డుతోపాటు ఇతర గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

ఠారెత్తిస్తున్న ఎండలతో...

కె.కోటపాడు: వేసవి అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు విలవిలలాడుతున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఒకే రీతిలో ఎండలు ఉండడంతో ఇంటికే పరిమితమవుతున్నారు. అత్యవసర పనులపై మాత్రమే రోడ్లపైకి వస్తున్నారు. ప్రధాన కూడళ్లలో మధ్యాహ్న సమయంలో జనసంచారం లేక రోడ్లన్నీ బోసిపోతున్నాయి.

కోనాం డ్వాక్రా సంఘం సమస్య పరిష్కారం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడికి కృతజ్ఞతలు చెబుతున్న కోనాం డ్వాక్రా సంఘం మహిళలు

దేవరాపల్లి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతీ స్వయం సహాయక సంఘానికి వైఎస్సార్ ఆసరా నగదును అందజేస్తామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. చీడికాడ మండలం కోనాం గ్రామంలో మరిడిమాంబ స్వయం సహాయక సంఘానికి సాంకేతిక కారణాలతో కొంత కాలంగా వైఎస్సార్ ఆసరా నగదు మంజూరు కాలేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామానికి వెళ్లిన ఆయన దృష్టికి సదరు సంఘ సభ్యులు తమ సమస్యను విన్నవించారు. దీనిపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సంఘ సభ్యులకు రూ. 5.43 లక్షలు మంజూరైంది. దాంతో సంఘ సభ్యులంతా తారువ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక కారణాలతో ఏ సంఘానికైనా వైఎస్సార్ ఆసరా నగదు జమ కాకుంటే తన దృష్టికి వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మరిడిమాంబ స్వయం సహాయక సంఘం ప్రెసిడెంట్ రెడ్డి సత్యవతి, స్థానిక నాయకులు దేముడునాయుడు, రొంగలి వెంకటరమణ పాల్గొన్నారు.

మరలా సీఎంగా జగనన్నే ఉండాలి

- పార్టీ నేతలంతా కలసికట్టుగా పనిచేయాలి
- గడపగడపకు ముగింపు సభలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: రాష్ట్రంలో మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలి.. ఇందుకోసం పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలంలో ఆదివారంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల నాయకులు, 21 మంది సర్పంచ్‌లు, 14 మంది ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలతో జోగుంపేట జంక్షన్‌లో భారీ సమావేశం నిర్వహించారు. వీరిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ గొలుగొండ మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధి 80 గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆ సమయంలో ప్రతీ గ్రామంలో ప్రజల ఆదరణ మరువలేనిదని తెలిపారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తుండటంతో టీడీపీ నేతలు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2024లో మరలా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. దీనికి ఎన్ని శక్తులొచ్చినా అడ్డుకోలేరని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర కలిగిన అయ్యన్నపాత్రుడు ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. అనేక పదవులు అనుభవించి తన స్వలాభమే చూసుకున్నారని దుయ్యబట్టారు. నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ లెక్కల సత్యన్నారాయణ, జడ్పీటీసీ సుర్లగిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యన్నారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లోచల సుజాతతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాడిరైతు కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న హరిబాబు

మాకవరపాలెం: అనారోగ్యంతో మృతి చెందిన పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. తామరం గ్రామానికి చెందిన ఇళ్ల పెదనూకరాజు గత నెల అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో విశాఖ డెయిరీ నుంచి రూ.15 వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని మృతుడి భార్యకు తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పాల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

నేడు వీరనారాయణంలో 'గడపగడపకు'

మాడుగుల: వీరనారాయణంలో సోమవారం ఉదయం 7 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైస్ ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరు కానున్నారన్నారు. మండలంలో పార్టీ శ్రేణులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, గృహసారథులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

వేసవిలో.. రావిచెట్టు నీడలో..



వి.వి.అగ్రహారంలో రావిచెట్టు కింద సేదదీరుతున్న బాటసారులు

మాడుగుల రూరల్: మన పూర్వీకులు దూరదృష్టితో ఆలోచించి గ్రామ కూడళ్లలో రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లు నేడు ఎందరికో ఫలహారం, నీడను ఇస్తున్నాయి. వి.వి.అగ్రహారం మోదమాంబ ఆలయం వెనుక భాగంలో భారీ రావి చెట్టు యాభై ఏళ్ల క్రితం నాటారు. అప్పటి నుంచి పెరిగి పెద్దదైన ఈ చెట్టు నీడలో ఎంతోమంది సేదదీరుతున్నారు. వడ్డాది నుంచి జి. అగ్రహారం, వీరనారాయణం, తదితర గ్రామాలకు వెళ్లేవారు, ఆదివారం సంత రోజున వడ్డాది వెళ్లేవారు చెట్టు కింద సేదతీరడంతోపాటు ఇక్కడ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

వేణుగోపాలుడి కల్యాణం నేడు

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 20 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19న ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 10.15కు జగన్నాథస్వామి ఆలయం నుంచి గవరపాలెం పెరుగుబజార్, గాంధీబొమ్మ జంక్షన్, మళ్లవీధి, గూడ్స్‌రోడ్డు వరకు రథోత్సవం కొనసాగుతుందన్నారు. గూడ్స్‌రోడ్డులోని ఇంద్రద్యుమ్న హాల్లో జగన్నాథస్వామికి ఈ నెల 29 వరకు దశావతరాల రూపంలో దర్శనం కల్పించనున్నారు.